విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

బిక్కనూరు, న్యూస్‌టుడే: విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనాన్ని అందించాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం బస్వాపూర్, భిక్కనూరు జడ్పీ(బాలుర) ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ.. లక్ష్యంతో అనుగుణంగా ప్రణాళికబద్ధంగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు చెబుతున్న పాఠ్యాంశాల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మౌలిక వసతుల విషయంలో ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనంతరం నూతనంగా నిర్మించిన భోజనశాలను పరిశీలించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

పోరాటాలకు సిద్ధం కావాలి

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణ అమలు కోసం పోరాటాలకు సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. నిజామాబాద్‌లో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఎన్నికల సమయంలో దివ్యాంగులు, వృద్ధులు, వితంతువుల పింఛన్లు పెంచుతామని ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చకపోవడం సిగ్గుచేటన్నారు. త్వరలో వర్గీకరణ అమలుకు చేపట్టే కార్యక్రమాలను ప్రకటిస్తామన్నారు. ఉద్యమాలకు మాదిగ, మాదిగ ఉపకులాలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, సోమశేఖర్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



మాదిగ అమరవీరుల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మందకృష్ణ మాదిగ, ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

వేయని కాంటా.. దళారులకే పంట

ఈనాడు, కామారెడ్డి, న్యూస్‌టుడే- బాన్సువాడ, బీర్కూర్

క్వింటాకు రూ.500 బోనస్ చెల్లించి సన్నధాన్యం కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా బాన్సువాడ నియోజకవర్గంలోని మెజారిటీ రైతులు దళారులకే విక్రయిస్తున్నారు. వాతావరణ మార్పులు, ప్రభుత్వ సేకరణపై కొరవడిన స్పష్టత, కేంద్రాల ఏర్పాటులో జాప్యమే ఇందుకు కారణం. నిజాంసాగర్ ఆయకట్టు ప్రాంతంలో వరికోతలు ప్రారంభమై 20 రోజులు గడుస్తున్నా.. ఇంకా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కాంటాలు ప్రారంభం కాలేదు. ఇదే అవకాశంగా దళారులు కనీస మద్దతు ధర కంటే తక్కువకే కొనుగోలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

సన్నధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో జాప్యం

ప్రారంభంతోనే సరి

జిల్లావ్యాప్తంగా ప్రస్తుత వానాకాలం సీజన్‌లో 6.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 419 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు సమాయత్తమయ్యారు. ఇందులో 63 కేంద్రాలను ప్రత్యేకంగా సన్నధాన్యం సేకరణకు కేటాయించారు. కానీ ఇప్పటి వరకు కేవలం 29 కేంద్రాలను మాత్రమే అధికారికంగా ప్రారంభించారు. ఇంకా ఒక్క కేంద్రంలోనూ కాంటాలు ప్రారంభించలేదు. సన్నధాన్యం నిర్ధారణకు ప్రభుత్వం గ్రేయిన్ కాలిఫర్ యంత్రాలను సిద్ధం చేయాలని మార్కెటింగ్ శాఖకు ఆదేశాలు జారీచేసింది. జిల్లాలో ఇప్పటి వరకు మార్కెటింగ్ శాఖ ఆ యంత్రాలను సిద్ధం చేయలేదు. మిల్లర్లు సన్నధాన్యం సేకరించేందుకు ససేమిరా అంటూ కలెక్టరేట్, పౌరసరఫరాల శాఖ అధికారులకు లేఖ అందించారు. ఈ నేపథ్యంలో సన్నధాన్యం నిల్వ చేసేందుకు గోదాంలను సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించినా.. శాఖల మధ్య కొరవడిన సమన్వయంతో ఇప్పటికి ఏర్పాట్లు చేయకపోవడం గమనార్హం.

కోతలు.. నగదు చెల్లింపులో దగా..

దళారులు కాటమిని కట్టి సంచికి కిలో నుంచి రెండు కిలోల తరుగు పేరిట కోత పెడుతున్నారు. నగదు చెల్లింపులో సైతం దగాకు పాల్పడుతున్నారు. రూ.లక్షకు రూ.వెయ్యి నుంచి రూ.రెండు వేల మినహాయించి చెల్లిస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సన్నధాన్యం సేకరణపై స్పష్టత కొరవడడంతో అన్నదాతలు దళారులు పెట్టిన డిమాండ్లకు తలొగ్గి విక్రయిస్తున్నారు.

ఆశ అడియాస

ప్రస్తుత వానాకాలం సీజన్‌లో వర్షాలు సమృద్ధిగా కురిసి ఆశించిన స్థాయిలో దిగుబడులు వచ్చాయి. కానీ అధికారుల అలసత్వం, పాలకుల పట్టింపులేని ధోరణితో కర్షకులు దిగాలు పడాల్సిన పరిస్థితి. రాష్ట్రంలోనే నిజాంసాగర్ ఆయకట్టు ప్రాంతంలో మొదటగా వరికోతలు ప్రారంభం అవుతాయని తెలిసినా, దానికి అనుగుణంగా సేకరణ కేంద్రాలను ప్రారంభించి కాంటాలు వేయించడంలో జిల్లా యంత్రాంగం ఏటా విఫలం అవుతోంది. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, రైతులు తీసుకువచ్చిన ధాన్యం నిర్దేశిత తేమ శాతం మేరకు ఉంటే కాంటాలు వేయడం ప్రారంభిస్తామని పౌరసరఫరాల శాఖ డీఎం రాజేందర్ పేర్కొన్నారు.

నిత్యం రూ.వంద తగ్గించి సేకరణ

కర్ణాటక, తమిళనాడు నుంచి వచ్చిన దళారులు బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్, వర్ని, రుద్రూర్, కోటగిరి తదితర ప్రాంతాల్లో పాగా వేసి పంటపొలాల వద్దే రైతుల నుంచి సన్నధాన్యం కొనుగోలు చేస్తున్నారు. వరికోతలు ప్రారంభమైన మొదట్లో క్వింటాకు రూ.2600 నుంచి రూ.2800 వరకు ధర పెట్టి సేకరించారు. ప్రస్తుతం క్వింటాకు రూ.2300 నుంచి రూ.2400 మాత్రమే చెల్లిస్తున్నారు. కేంద్రాల ప్రారంభంలో జాప్యం జరుగుతుండడంతో దళారులు రోజు రోజుకూ ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు.



బీర్కూర్‌లో రైతుల పంటపొలాల వద్ద కాంటాలు వేస్తున్న దళారులు

తీరనున్న బోధన వెతలు

న్యూస్‌టుడే, కామారెడ్డి విద్యావిభాగం

విధుల్లో చేరిన 434 మంది ఉపాధ్యాయులు

సుదీర్ఘకాల నిరీక్షణకు తెరపడింది. డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం అర్ధరాత్రి వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎట్టకేలకు 434 మంది ఉపాధ్యాయులు బుధవారం విధుల్లో చేరారు. ఎంపిక ధ్రువపత్రాలు అందుకున్నవారు ప్రధానోపాధ్యాయులకు రిపోర్ట్ చేశారు. స్కూల్‌అసిస్టెంట్‌లలో ఐదుగురు, ఎస్జీటీల్లో ఒకరు విధుల్లో చేరలేదు. ఇన్నాళ్లు సర్కారు బడుల్లో ఉపాధ్యాయులు లేక బోధన అంతంత మాత్రంగానే ఉంది. తాజాగా సర్కారు ఉపాధ్యాయుల భర్తీకి చర్యలు చేపట్టడంతో యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది.

కేటగిరీ	విధుల్లో చేరినవారు
స్కూల్‌అసిస్టెంట్‌లు	109
భాషాపండిత్	11
పీఈటీ	5
ఎస్జీటీ	255
ఎస్జీటీ(ప్రత్యేక విద్య)	25
ఎస్జీటీ లాంగ్వేజెస్	29

సమస్యలకు పరిష్కారం

జిల్లాలో 168 ఉన్నత బడులు ఉన్నాయి. అందులో మొన్నటివరకు స్కూల్‌అసిస్టెంట్‌లు లేక వివిధ విషయాల బోధనకు ఆటంకం కలిగింది. సమీప బడుల్లోని బోధకులకు బాధ్యతలు అప్పగించారు. పాఠ్యప్రణాళిక నిర్దిష్ట సమయంలో పూర్తికాక ఇబ్బందులు తలెత్తేవి. విద్యార్థులు పరీక్షల్లో రాణించలేకపోయారు. ఫలితంగా ఉత్తీర్ణత శాతంపై ప్రభావం చూపింది. తాజాగా ఉపాధ్యాయుల నియామకాల ప్రక్రియతో సమస్య తీరనుందని అధికారులు భావిస్తున్నారు.

ప్రాథమిక విద్యకు ఊతం

జిల్లాలోని ప్రాథమిక బడుల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లు లేక విద్యాబోధన కుంటుపడింది. కొవిడ్‌కు ముందు విద్యావాలంటీర్లు బడుల్లో బోధన చేపట్టి విద్యాశాఖకు అండగా నిలిచారు. ఆ తర్వాత వారిని కొనసాగించలేదు. చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన చేశాయి. ఎట్టకేలకు ప్రాథమిక బడుల్లో బోధకులు రావడంతో విద్యార్థులకు సౌకర్యం కలగనుంది.

వచ్చే డీఎస్సీపై ఆశలు

డీఎస్సీ-2024 ఉద్యోగ ప్రకటనలో జిల్లాలో 506 ఉద్యోగాలకు పరీక్ష నిర్వహించారు. ఈసారి అత్యధికంగా ఎస్జీటీ ఉద్యోగాలు ఉన్న జిల్లాలో కామారెడ్డి ఒకటి. వచ్చే డీఎస్సీలో ఈ స్థాయిలో సెకండరీగ్రేడ్ టీచర్ ఉద్యోగాలు వచ్చే అవకాశాలు లేవు. సర్దుబాటు, ఖాళీల లెక్క తేలాక మరో ఉద్యోగ ప్రకటన విడుదలయ్యే అవకాశం ఉంది.



కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు

బాధ్యతాయుతంగా పనిచేయాలి

నూతన ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా పనిచేయాలి. ఎన్నో ఏళ్ల కష్టపడి చదివి పోటీపరీక్ష రాసి విజయం సాధించినవారందరికీ అభినందనలు. విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దేందుకు పాటుపడాలి. విద్యాశాఖకు తోడ్పాటు అందించాలి. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి. డీఎస్సీ ప్రక్రియలో అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన నుంచి నియామకపత్రాలు ఇచ్చేంత వరకు సహకరించిన సిబ్బందికి కృతజ్ఞతలు. **- రాజు, డీఈవో-కామారెడ్డి**

బ్యాంకర్లు రుణలక్ష్యం చేరాలి : పాలనాధికారి

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: బ్యాంకర్లు రుణ లక్ష్యాన్ని చేరుకోవాలని జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలు మరిన్ని ఎక్కువగా మంజూరు చేయాలని సూచించారు. విద్య, గృహాలు, సామాజిక మౌలిక సదుపాయాల రుణాలను మంజూరు చేయాలని కోరారు. గ్రామీణ, పట్టణ మహిళా సంఘాలకు ముందే నిర్ణయించిన లక్ష్యం ప్రకారం రుణాలు ఇవ్వాలని పేర్కొన్నారు. బ్యాంకు లింకేజీ మొండి బకాయిలను వసూలు చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ కులాల లబ్ధిదారులకు గతంలో మంజూరైన రాయితీ రుణాలను గ్రౌండింగ్ చేయాలని కోరారు. దేవునిపల్లి, వాజిద్‌నగర్, మిర్జాపూర్, కామారెడ్డి గంజ్ సహకార బ్యాంకులను కామారెడ్డి జిల్లాలో విలీనం చేయాలన్నారు. కార్యక్రమంలో లీడ్‌బ్యాంకు మేనేజర్ రవికాంత్, డీఆర్‌డీవో సురేందర్, డీఏవో తిరుమల ప్రసాద్, ఎస్సీ సంక్షేమాధికారిణి రజిత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

విమానం అందుకోలేక యువకుడి మనస్తాపం

సౌదీకి వెళ్లే అవకాశం చేజారడంతో ఆత్మహత్య

బాల్కొండ, న్యూస్‌టుడే: విమానం అందుకోలేక గల్ఫ్ వెళ్లాల్సిన యువకుడు మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలం బస్సాపూర్‌లో చోటుచేసుకుంది. ఏఎస్సై శంకర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొండ్రు గణేశ్(25) ఉపాధి నిమిత్తం సౌదీఅరేబియా వెళ్లేందుకు అప్పులు చేశారు. మంగళవారం బయలుదేరడానికి టిక్కెట్ సైతం బుక్ చేసుకున్నారు. బస్సాపూర్‌లో ఇంటి నుంచి హైదరాబాద్‌లోని విమానాశ్రయానికి బయలుదేరారు. కానీ సరైన సమయానికి చేరుకోకపోవడంతో లోపలికి అనుమతి లభించలేదు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో నిరాశగా ఇంటికి వెనుదిరిగారు. తీవ్ర మనస్తాపానికి గురైన గణేశ్ అప్పులు ఎలా తీర్చాలో తెలియక గడ్డి మందు తాగారు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం మొదట నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. మృతుడి తండ్రి చిన్నయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కొండ్రు గణేశ్

మిల్లర్లపై చర్యలకు అడుగులు

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే

ప్రభుత్వం నుంచి ధాన్యం తీసుకుని సకాలంలో సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) ఇవ్వని మిల్లర్లపై అధికారులు చర్యలకు సిద్ధమవుతున్నారు. ఇప్పటి వరకు అనేకమార్లు గడువు పొడిగించినప్పటికీ మిల్లర్ల వైఖరిలో మార్పు రాలేదు. దీంతో అధికారులు చర్యలకు ఉపక్రమిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 49 మిల్లుల యజమానులు సర్కారు నుంచి తీసుకున్న ధాన్యాన్ని బియ్యంగా మార్చి ఇవ్వలేదు. అసలు ఇందులోని కొన్ని మిల్లుల్లో ధాన్యాన్నే మాయం చేసినట్లుగా తెలుస్తోంది. దీంతో పౌరసరసరఫరాల శాఖ అధికారులు మిల్లులను క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నారు. ధాన్యం ఎవరి పేరిట ఒప్పందం జరిగింది. పూచీకత్తు సంతకాలు ఎవరెవరు చేశారో అని ఆరా తీస్తున్నారు. ఒక్కో మిల్లు యజమాని ఎంత డబ్బులు ప్రభుత్వానికి బాకీ పడ్డారో లెక్కలు తేల్చుతున్నారు. మరో వారం రోజుల్లో పూర్తిస్థాయి నివేదికలు సిద్ధం చేయనున్నారు.

ఆ మిల్లుల రిజిస్ట్రేషన్ చేయొద్దు

జిల్లాలో డీఫాల్ట్ అయిన మిల్లులపై అధికారులు నిఘా పెంచారు. తాజాగా సదరు మిల్లుల జాబితా రూపొందించారు. దీనిని జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్లకు, తహసీల్దార్లకు పంపిస్తున్నారు. ప్రభుత్వానికి సీఎంఆర్ బాకీపడిన మిల్లులను తహసీల్దార్లు ఆధీనంలో ఉంచుకోవాలని సూచిస్తున్నారు. అదేవిధంగా ఆయా మిల్లులను ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్ చేయకుండా ఉండడం కోసం సబ్‌రిజిస్ట్రార్లకు లేఖలు రాస్తున్నారు. పూర్తి నివేదిక అందిన తర్వాత మిల్లుల యజమానులపై కేసులు నమోదు చేయడంతో పాటు ఆర్ఆర్(రెవెన్యూ రికవరీ) చట్టాన్ని ప్రయోగించడానికి సిద్ధమవుతున్నారు. ప్రభుత్వానికి బియ్యం లేదా నగదు చెల్లించే వరకు ఆయా మిల్లులకు తిరిగి ధాన్యాన్ని కేటాయించే అవకాశం ఉండదు.

నివేదిక వచ్చాకే .. లెక్క తేలుతుంది

జిల్లాలో 49 మిల్లులకు కేటాయించిన ధాన్యం లెక్కలు అధికారుల వద్ద ఉన్నాయి. అయితే వారు ప్రభుత్వానికి ఎంత బియ్యాన్ని తిరిగి ఇవ్వాలో ధాన్యం ఇచ్చినప్పుడే నిర్ణయించారు. ఇందులో కొన్ని మిల్లుల వారు కొంత సీఎంఆర్‌ను ప్రభుత్వానికి ఇచ్చారు. మిగిలిన ధాన్యం ఎంత ఉంది. ఇంకా ఎంత ఇవ్వాలనేది అధికారులు క్షేత్రస్థాయిలో లెక్క తేల్చుతున్నారు. పూర్తి లెక్కలు వచ్చేవరకు అధికారులు ముందుజాగ్రత్తగా సబ్‌రిజిస్ట్రార్లకు, తహసీల్దార్లకు లేఖలు రాస్తున్నారు. ధాన్యం ఇవ్వని మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని పౌరసరఫరాలశాఖ మేనేజర్ రాజేందర్ పేర్కొన్నారు. డీఫాల్టర్లపై ఆర్ఆర్ చట్టం ప్రయోగిస్తామని తెలిపారు.

వంతెన నిర్మాణానికి రూ.4.9 కోట్లు మంజూరు

గాంధారి : మండల కేంద్రంలోని పోచమ్మ రేవు వద్ద నుంచి రైతుల పొలాలకు వెళ్లే మార్గంలో పెద్ద వాగుపై వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే మదన్‌మోహన్ చొరవతో సీఆర్ఆర్ నిధుల ద్వారా రూ.4.9 కోట్లు మంజూరైనట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తూర్పు రాజులు బుధవారం తెలిపారు

పర్యాటక కేంద్రంగా నిజాంసాగర్

నిజాంసాగర్, న్యూస్‌టుడే: నిజాంసాగర్ జలాశయంపై ఉన్న గోల్ బంగ్లా సమీపంలో నాలుగెకరాల ప్రభుత్వ భూమిలో పర్యాటక కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి తెలిపారు. బుధవారం నిజాంసాగర్ మండలంలోని పలు ప్రాంతాలను ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. అచ్చంపేట్ గ్రామ శివారులోని సర్వే నంబర్ 121లో నాలుగు ఎకరాల ప్రభుత్వ భూమిని కేంద్రం ఏర్పాటుకు కేటాయించామని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్‌లు పెండింగ్ లేకుండా చూడాలని ఆదేశించారు. 30 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల్లో 20 వరకు పూర్తిచేయించారు. ఆదర్శ పాఠశాలలో తరగతి గదులను తనిఖీ చేసి విద్యార్థులతో ముచ్చటించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం ఉండాలని ఏజెన్సీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అచ్చంపేట్‌లో దళిత బంధు లబ్ధిదారులతో పథకం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భిక్షపతి, ఆర్ఐ అంజయ్య, సర్వేయర్ శ్రీకాంత్, జలవనరులశాఖ ఏఈఈ శివప్రసాద్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్య తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో చర్చిస్తున్న బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి

13 మంది కొత్త వ్యవసాయాధికారులు

న్యూస్‌టుడే, కామారెడ్డి వ్యవసాయం

జిల్లాకు కొత్తగా 13 మంది వ్యవసాయాధికారులు వచ్చారు. మొత్తం 14 మంది వచ్చినప్పటికీ గాంధారి ఏవోగా నియామకమైన ప్రత్యూష ఆన్‌డ్యూటీపై ఖమ్మం డీఏవో కార్యాలయంలో ఏవో టెక్నికల్‌గా పనిచేసేందుకు వెళ్లారు. డీఏవో కామారెడ్డి కార్యాలయానికి నియామకమైన డి.అచరిత ఆన్‌డ్యూటీపై ఏడీఏ (ఎస్ఎస్ఎఫ్) మల్లుమ్మెద కార్యాలయానికి ఏవో టెక్నికల్‌గా వెళ్లనున్నారు. ఎల్లారెడ్డికి నియామకమైన బి.శోభ ఆన్‌డ్యూటీపై కామారెడ్డి ఏడీఏ కార్యాలయానికి ఏవో టెక్నికల్‌గా వెళ్లనున్నారు.

* జిల్లాలో వివిధ మండలాల్లో పనిచేస్తున్న నలుగురు ఏవోలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. వారిలో ముగ్గురు జిల్లాలోని వివిధ మండలాలు, స్థానాలకు బదిలీ కాగా గాంధారిలో పనిచేస్తున్న సుప్రజ్యోతిని మాత్రం జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు బదిలీ చేశారు.

వ్యవసాయాధికారి పేరు	పనిచేయనున్న మండలం/ ప్రాంతం
టి.మణిదీపిక	దోమకొండ
వి.పవన్‌కుమార్	మాచారెడ్డి
వి.సాయికిరణ్	నాగిరెడ్డిపేట
జి.నవ్య	మహ్మద్‌నగర్
బి.భానుశ్రీ	రామారెడ్డి
ఎండీ మిఫ్తాఫయిజుల్లాహ్	బాన్సువాడ
ఆర్.భవాని	నస్రుల్లాబాద్
ఇ.సుస్మితారాణి	డీఏవో కామారెడ్డి
బి.మహేశ్వరి	జుక్కల్
బి.కార్తీక్	బీర్కూర్
కె.శివకుమార్	డోంగ్లి

వ్యవసాయ అధికారి	పనిచేస్తున్న స్థానం	బదిలీ అయిన ప్రాంతం
నదీముద్దీన్	బాన్సువాడ	ఎల్లారెడ్డి
రాజలింగం	బిచ్కుంద	గాంధారి
సునితారాణి	రాజంపేట	★★★

★★★ : డీఏవో కార్యాలయం ఏవో (టెక్నికల్)

ఆటోలకు క్యూఆర్ కోడ్

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: ఆటో డ్రైవర్లు భద్రతా నియమాలు పాటిస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో దేవునిపల్లి, రామారెడ్డి, మాచారెడ్డి పోలీసుస్టేషన్ల పరిధిలోని ఆటో డ్రైవర్లకు బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతి ఆటోకు క్యూఆర్ కోడ్‌ను ఏర్పాటు చేయడం, డ్రైవర్లకు రెండేళ్ల పాటు బీమా సౌకర్యాన్ని జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో కామారెడ్డి గ్రామీణ సీఐ రామన్, దేవునిపల్లి ఎస్సై రాజు, రామారెడ్డి ఎస్సై నరేష్ పాల్గొన్నారు.

తగ్గని రద్దీ..
సీట్లకు పాట్లు ... 8లో



పల్వంచ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బీడీ కార్మికులు

జీవనభృతి పెంచాలి

మాచారెడ్డి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం బీడీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని బీడీ వర్కర్స్ యూనియన్, ఎఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో పల్వంచలో బుధవారం నిరసన తెలిపారు. మండలకేంద్రంలోని బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు బీడీ కార్మికులు ర్యాలీగా వెళ్లారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కోపా చట్టం, జీఎస్టీ మూలంగా పనిలేక, ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జీవనభృతిని రూ.2016 నుంచి రూ.4016 పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ జయంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కురిసిన వర్షం.. తడిసిన ధాన్యం

బీర్కూర్, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో బుధవారం కురిసిన అకాల వర్షానికి ధాన్యం తడిసి ముద్దయింది. స్థానిక మార్కెట్ యార్డులో పది రోజులుగా ఆరబెట్టిన ధాన్యం కొట్టుకుపోయింది. వర్షం నీళ్లల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని చూసి రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. సకాలంలో కొనుగోలు కేంద్రం ప్రారంభించకపోవడంతోనే ధాన్యం తడిసిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు.





బీర్కూర్‌లో తడిసిన ధాన్యం చూపుతున్న రైతులు : మార్కెట్ యార్డులో నిలిచిన నీరు



నిజామాబాద్ ప్రధాన బస్టాండులో ప్రయాణికులు

తగ్గని రద్దీ.. సీట్లకు పాట్లు

దసరా పండగకు సొంత గ్రామాలకు వచ్చి తిరిగి ఉద్యోగాలు, చదువుల కోసం పట్టణాల బాట పట్టిన ప్రయాణికులతో ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాలు కిటకిటలాడుతూనే ఉన్నాయి. రద్దీ పెరగడంతో సీట్ల కోసం బస్సుల్లో పోటీపడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుధవారం సాయంత్రం నిజామాబాద్ బస్టాండ్‌లో కనిపించిన దృశ్యాలివి. – ఈనాడు, నిజామాబాద్



కిటికీల్లో నుంచి సీట్ల కోసం వస్తువులు వేస్తున్నారిలా..



కోతుల బెడద.. జనం దడ

రోడ్డు మీద కోతుల గుంపు సంచరిస్తుండడంతో భయంతో ప్రజలు ఇళ్లకే పరిమితమైన ఈ చిత్రం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని వివేకానంద కాలనీలోనిది. ఈ చిత్రాన్ని న్యూస్‌టుడే బుధవారం క్లిక్‌మనిపించింది. జిల్లా కేంద్రంలోని మెజారిటీ కాలనీల్లో ఇదే పరిస్థితి నెలకొంటోంది. రోజూ ఏదో చోట కోతుల దాడిలో ప్రజలు గాయపడి ఆసుపత్రుల్లో చేరుతున్నారు. సంబంధిత శాఖల అధికారులు కోతుల బెడదను నివారించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కామారెడ్డి అర్బన్

గుంత చింత తీరేదెన్నడు?

కామారెడ్డి జిల్లాకేంద్రం రాంమందిర్‌కు వెళ్లే రోడ్డులోని గాంధీ గంజ్ ప్రాంతంలో ఏర్పడిన గుంత వాహనదారులు, ప్రజలకు ప్రమాదకరంగా మారింది. నిత్యం ఈ రోడ్డుపై వందల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గుంతను గమనించక ప్రమాదాలకు గురవుతున్నారు. రాజంపేట మండలం శివాయిపల్లికి చెందిన యువకుడి కారు టైర్ బుధవారం ఇలా గుంతలో ఇరుక్కుంది. స్థానికులు గమనించి ప్రమాదాన్ని నివారించగలిగారు. సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని వాహనదారులు కోరుతున్నారు.

న్యూస్‌టుడే, కామారెడ్డి నేరవిభాగం



ఇరుక్కున్న కారు



అంతరచిత్రంలో గుంత

పద్మశాలీలు రాజకీయంగా ఎదగాలి

● సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళి

కరీంనగర్, న్యూస్‌టుడే: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని జిల్లాల్లో పద్మశాలీలు రాజకీయ బలంతో ఉండి, సత్తా చాటాలని పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కమర్తపు మురళి పిలుపునిచ్చారు. బుధవారం కరీంనగర్ పద్మశాలీ ట్రస్టు భవనంలో ఆ సంఘం రాష్ట్ర విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి హాజరయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు మురళి మాట్లాడుతూ.. గడువు పూర్తయిన జిల్లా శాఖలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. మార్చిలో పది వేల మందితో అఖిల భారత పద్మశాలీ సంఘం మహాసభను ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్ర మాజీ అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్ సంఘం అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. మహబూబ్‌నగర్‌లో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మెతుకు సత్యం రూ.లక్ష విరాళం ప్రకటించడాన్ని అభినందించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం జగన్నాథం, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు మెతుకు సత్యం, రాష్ట్ర రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ వాసాల రమేశ్, ప్రధాన కార్యదర్శి మాచర్ల రాంచంద్రం, మున్సిపల్ ఛైర్మన్ రుద్రరాజు, కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ, తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పద్మశాలీ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మురళి

జాతీయస్థాయి కథల పోటీల్లో ప్రతిభ

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: మాదిరాజు బాలసాహిత్య కళాపీఠం ఆధ్వర్యంలో గత నెలలో నిర్వహించిన జాతీయస్థాయి కథల పోటీల్లో విజయ్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని బి.తనుశ్రీ ప్రతిభ కనబర్చినట్లు కరస్పాండెంట్ ప్రభాదేవి బుధవారం తెలిపారు. విద్యార్థినితో పాటు ఆమె గైడ్‌టీచర్‌ను పాఠశాల కార్యదర్శి అమృతలత అభినందించారు. అన్ని రాష్ట్రాల నుంచి 250మంది విద్యార్థులు పాల్గొనగా.. 20 ఉత్తమ కథలు ఎంపిక చేశారని అందులో తనుశ్రీ రాసిన 'కష్టేఫలి' కథకు చోటుదక్కడం అభినందనీయమన్నారు. నవంబరు 3న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో బహుమతి ప్రదానోత్సవం ఉంటుందని వెల్లడించారు.



విద్యార్థిని అభినందిస్తున్న విజయ్ పాఠశాల కార్యదర్శి అమృతలత

ఇంకా సందిగ్ధతే..!

● ధాన్యాన్ని మిల్లులకు కేటాయిస్తారా.. నిల్వ చేస్తారా

● ఉమ్మడి జిల్లాలో గోదాములను పరిశీలిస్తున్న అధికారులు

న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్

వానాకాలం సీజన్ ధాన్యం కేటాయింపులపై సందిగ్ధత నెలకొంది. ఈ ధాన్యాన్ని మిల్లర్లకు కేటాయిస్తారా లేక గోదాముల్లో నిల్వ చేస్తారా అనే విషయంపై ఇప్పటి వరకు స్పష్టత రాలేదు. ఉమ్మడి జిల్లాలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. కొనుగోలు కేంద్రాలు తెరుస్తున్నారు. సన్న ధాన్యం తీసుకుంటే తాము నష్టపోతామని, ఎట్టి పరిస్థితుల్లో సన్నరకాలను తీసుకోబోమని మిల్లర్లు కలెక్టర్లకు లేఖలు రాశారు. దాంతో పాటు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్లు పెట్టారు. దీంతో సర్కార్ మాటూ స్పందించినట్లు తెలుస్తోంది. ఈ వానాకాలం సీజన్ ధాన్యాన్ని మిల్లులకు కేటాయించవలసి తామే గోదాముల్లో నిల్వ చేస్తామని పేర్కొంది. ఇప్పటి వరకు మిల్లుల కేటాయింపులు పూర్తికాలేదు. ఒకవైపు ప్రైవేట్ వ్యాపారులు ధాన్యాన్ని కొంటున్నప్పటికీ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదు.

గోదాములు ఎన్ని ఉన్నాయి?

వానాకాలం సీజన్‌లో కామారెడ్డి జిల్లాలో 419 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 5.50 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని సేకరించడానికి ప్రణాళిక రూపొందించారు. ఇక నిజామాబాద్ జిల్లాలో 629 కొనుగోలు కేంద్రాల ద్వారా 8 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం సేకరణకు సిద్ధమయ్యారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఉమ్మడి జిల్లాలో ఉన్న 490 రైసుమిల్లులకు కేటాయించేవారు. అవసరమైతే పక్క జిల్లాలకు కూడా పంపేవారు. అయితే ప్రస్తుతం మిల్లుల కేటాయింపులు పూర్తికాలేదు. ఈలోగా తామే గోదాముల్లో ధాన్యాన్ని నిల్వ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో అధికారులు అందుబాటులో



ఉన్న గోదాముల వివరాలు సేకరిస్తున్నారు. మొత్తం గోదాముల్లో ఎంత ధాన్యం పడుతుందో లెక్కలు వేస్తున్నారు. సుమారు 13.50 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం గోదాముల్లో పట్టే అవకాశం లేదు. ఉమ్మడి జిల్లాలో అసలే గోదాముల కొరత వేధిస్తోంది. ఇప్పటికైతే గోదాముల వివరాలు ఆరా తీస్తున్నామని **కామారెడ్డి పౌరసరఫరాలశాఖ డీఎం రాజేందర్** పేర్కొన్నారు.

తూకం అధికంగా వేయొద్దు

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని అధికంగా తూకం వేయొద్దని భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధులు పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా కలెక్టర్‌ను బుధవారం కలిసి రైతు పక్షాల డిమాండ్లను విన్నవించారు. జిల్లా వ్యాప్తంగా 40 కిలోల 650 గ్రాముల ధాన్యాన్ని మాత్రమే తూకం వేయాలని పేర్కొన్నారు. అంతకంటే ఎక్కువ తూకం వేయడం కుదరదన్నారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో సిటిజన్ బ్యాలెట్ ఫ్లెక్సీలను అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యం విక్రయించిన 24 గంటల వ్యవధిలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని విజ్ఞప్తి చేశారు. అవసరమైన టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి అంబీర్ ఆనంద్‌రావు, రాష్ట్ర సభ్యుడు శ్రీధర్‌రెడ్డి, జోనల్ అధ్యక్షుడు లంక వెంకట్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్‌రెడ్డి, కార్యదర్శి శంకర్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు రాయసం తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌కు వచ్చిన భారతీయ కిసాన్‌సంఘ్ ప్రతినిధులు

కళోత్సవ్ ప్రారంభం

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: నగరంలోని బాల్‌భవన్‌లో విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్(ఏఎంవో) జీవన్ అధ్యక్షతన జిల్లాస్థాయి కళోత్సవ్ పోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల నుంచి 9, 10, 11, 12వ తరగతులకు సంబంధించిన విద్యార్థులు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా డీఈవో దుర్గాప్రసాద్ హాజరై పోటీలను తిలకించారు. మొదటి రోజు గాత్ర సంగీతంలో కర్ణాటక, హిందుస్థానీ, జానపద పాటల పోటీలు కాగా, వాద్యసంగీతంలో తబలా, డోలక్, డప్పు, వయోలిన్, గిటార్లతో ప్రదర్శనలు నిర్వహించారు. ఇందులో ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. బాలభవన్ పర్యవేక్షణాధికారి ప్రభాకర్, గైడ్ టీచర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యాశాఖ ఏఎంవో జీవన్

బకాయిలు విడుదల చేయాలని డిమాండ్

ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే: ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని సీపీఐ నాయకులు డిమాండు చేశారు. బుధవారం సీపీఐ జిల్లా కౌన్సిల్ నుంచి ముఖ్యమంత్రికి బహిరంగ లేఖ రాశారు. రెండేళ్లుగా ఉన్న బకాయిలు ఇవ్వాలన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్, ఓమయ్య, రఘురాం, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రికి రాసిన లేఖను చూపుతున్న సీపీఐ నాయకులు

ఫుట్‌బాల్‌లో కాంస్య పతకాలు

నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే: విజయ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సీహెచ్ జాహ్నవి, జె.మధుశ్రీ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ అండర్-17 బాలికల విభాగంలో పాల్గొని కాంస్య పతకాలు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ ప్రభాదేవి తెలిపారు. పాఠశాల కార్యదర్శి అమృతలత విద్యార్థుల్ని అభినందించారు.

బీడీ కార్మికుల ధర్నా

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కామారెడ్డి జిల్లాకేంద్రంలోని సిరిసిల్లరోడ్డులో దేశాయి బీడీ సంస్థ ఎదుట బుధవారం ధర్నా చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమ మాట్లాడుతూ.. యాజమాన్య ప్రతినిధులు బీడీ కార్ఖానాల వద్దకు వెళ్లి డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. కార్మికుల నుంచి 400 బీడీలు స్వీకరిస్తున్నారన్నారు. కార్మికుల శ్రమ దోపిడీకి పాల్పడుతున్న యాజమాన్యంపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు వెంకట్‌గౌడ్, నర్సింలు, అరుణ్, శ్రీహరి, రాణి, భాగ్యమ్మ, రేణుక, లక్ష్మి, ప్రేమలత, జ్యోతి, సత్యం, రాజనర్సు, వాణి, మంజుల తదితరులున్నారు.



ధర్నా చేస్తున్న కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న రమ



కార్యక్రమంలో పాల్గొన్న ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రతిమారాజ్

ప్రపంచ అనస్థీషియా దినోత్సవం

నిజామాబాద్ వైద్యవిభాగం, న్యూస్‌టుడే: ప్రపంచ అనస్థీషియా దినోత్సవం బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యకళాశాల, ఇండియన్ సొసైటీ అనస్థీషియా వైద్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థులు సీఎంఈలో పాల్గొని పరిశోధనలు సీనియర్ వైద్యులకు వివరించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్, అనస్థీషియా విభాగం అధిపతి మల్లారెడ్డి, వైద్యులు పి.సుధాకర్, రామకృష్ణ, చైతన్య, సునీల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

19న ఈత ఎంపికలు

నిజామాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న ఉదయం 10 గంటలకు నగరంలోని డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్‌లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అండర్-14, 17 బాలబాలికలకు ఈత క్రీడాకారుల ఎంపికలు ఉంటాయని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు పాఠశాల బోనాఫైడ్ వెంట తెచ్చుకోవాలని పేర్కొన్నారు. అండర్-14 బాలురు 2011 జనవరి 1, ఆ తర్వాత పుట్టినవారు, అండర్-17 బాలబాలికలు 2008 జనవరి 1, ఆ తర్వాత పుట్టిన వారు అర్హులన్నారు. వివరాలకు 93472 16426 నంబరులో సంప్రదించాలన్నారు.

బ్యాడ్మింటన్‌లో..

నిజామాబాద్ క్రీడావిభాగం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న ఉదయం 10 గంటలకు నిజామాబాద్ ఆఫీసర్స్ క్లబ్‌లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా అండర్-14 బాలబాలికల బ్యాడ్మింటన్ ఎంపికలు ఉంటాయని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి తెలిపారు. క్రీడాకారులు కిట్లు, షూతో రావాలని, బోనాఫైడ్ తెచ్చుకోవాలని సూచించారు. అండర్-14 బాలురు 2011 జనవరి 1, ఆ తర్వాత పుట్టినవారు అర్హులన్నారు.

నవోదయ విద్యాలయంలో ప్రవేశాలు

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: నిజాంసాగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరంలో తొమ్మిది, పదకొండు తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశాలకు ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కామారెడ్డి విద్యాశాఖ జిల్లా అధికారి రాజు ఓ ప్రకటనలో తెలిపారు. www.navodaya.gov.in వెబ్‌సైట్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

విద్యారంగంపై పట్టింపు కరవు

తెవివి క్యాంపస్, న్యూస్‌టుడే: ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని తెవివి నూతన బాలుర వసతి గృహం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగాన్ని పట్టించుకోవడం లేదని సంఘం జిల్లా కార్యదర్శి విఘ్నేష్ ఆరోపించారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలు బంద్ కొనసాగిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలతో చర్చించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు దినేశ్, చక్రి, జీవన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సహాయ కేంద్రం ఏర్పాటు

తెవివి క్యాంపస్, న్యూస్‌టుడే: తెలంగాణ విశ్వవిద్యాలయంలో నూతన ప్రవేశాలు పొందిన విద్యార్థుల సందేహాల నివృత్తి కోసం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం సహాయ కేంద్రం ఏర్పాటు చేశారు. దరఖాస్తు పూరించడం, ఇతర వివరాలు విద్యార్థులకు వివరించారు. ఏబీవీపీ వర్సిటీ అధ్యక్షుడు సాయికుమార్, నాయకులు అనిల్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల సందేహాలు తీరుస్తున్న ఏబీవీపీ ప్రతినిధులు

రహదారిపైకి మొసలి

తాళ్లరాంపూర్(ఏర్గట్ల), న్యూస్‌టుడే: మండలంలోని తాళ్లరాంపూర్‌లో మంగళవారం అర్ధరాత్రి ప్రాంతంలో ఆరోగ్య ఉప కేంద్రానికి సమీపంలో రహదారిపైకి మొసలి వచ్చినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయాన్ని కమ్మర్‌పల్లి అటవీశాఖ అధికారులకు తెలియజేశారు. అధికారులు వచ్చేలోపు శివారులోని కాలువ ద్వారా వెళ్లిపోయి ఉండవచ్చని గ్రామస్థులు పేర్కొన్నారు.



అటవీ సెక్షన్ అధికారి మృతి

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: బాన్సువాడ అటవీ రేంజ్ పరిధిలో పనిచేస్తున్న నిజాంసాగర్ సెక్షన్ అధికారి (ఎఫ్ఎస్‌వో) గులాం దస్తగిరి(58) విధులు నిర్వహిస్తూ అస్వస్థతకు గురై చనిపోయారు. వివరాలిలా.. బుధవారం విధులకు వచ్చిన ఆయన ఒక్కసారిగా అస్వస్థతకు గురికావడంతో బాన్సువాడ పట్టణంలోని ప్రాంతీయాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. ఈయన స్వస్థలం సిద్దిపేట జిల్లా ములుగు. రెండేళ్ల కిందట పదోన్నతిపై బాన్సువాడ రేంజ్‌కు వచ్చారు. కామారెడ్డి జిల్లా అటవీ అధికారి నిఖిత, ఇన్‌ఛార్జి డివిజన్ అధికారి రామకృష్ణ, రేంజ్ అధికారి హబీబ్ భౌతిక కాయానికి నివాళులర్పించారు.



గులాం దస్తగిరి

కారు బోల్తా.. కానిస్టేబుల్‌కు గాయాలు

డిచ్‌పల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: కారు అదుపుతప్పి జాతీయ రహదారి వంతెన పై నుంచి బోల్తాపడిన ఘటన డిచ్‌పల్లి మండలం బీబీపూర్‌తండా సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలో ఏఆర్ పోలీస్ విభాగంలో పనిచేస్తున్న కానిస్టేబుల్ బాల్‌సింగ్ ఇందల్‌వాయి మండలం పాటితండాకు వెళ్లి, సాయంత్రం నిజామాబాద్‌కు తిరుగు పయనమయ్యారు. ఈ క్రమంలో కారు అదుపు తప్పి వంతెన పైనుంచి కిందకు పడింది. ప్రమాద సమయంలో కారు నాలుగు డోర్లు లాక్ అయ్యాయి. వెనకాల తలుపు తెరుచుకోవడంతో బాల్‌సింగ్ బయటకు వచ్చారు. అదే మార్గంలో వెళ్తున్న సీఐ మహేష్ ఘటన స్థలం వద్ద ఆగి హైవే పెట్రోలింగ్ పోలీసులు, టోల్‌ప్లాజా సిబ్బందికి సమాచారం అందించడంతో సత్వరమే స్పందించారు. ఘటనాస్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించారు. వెంటనే క్రేన్ తెప్పించి కారును బయటకు తీయించారు.



ఏషియన్ ప్రియా సినీప్లెక్స్ — ఈనాడు సినిమాలు

వెట్టయాన్ ది హంటర్ 11.00 2.15 6.00 9.15
విశ్వం 11.00 2.00 6.00 9.00

వీ సినిమాస్

దేవర 10.50 2.15 5.50 9.30

ఏషియన్ దర్పన్

మార్టిన్ 11.00 6.00
మా నాన్న సూపర్ హీరో 2.00 9.00

- న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
బాన్సువాడ 83284 29129
కామారెడ్డి 93970 82242



కామారెడ్డిలో కొత్తబస్టాండ్ ప్రాంతంలో దుర్వాసన వస్తోంది. - రాజు, కొత్తబస్టాండు

బ్లీచింగ్ పౌడర్‌ను చల్లాం. - పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్



జిల్లాకేంద్రంలోని పాతబస్టాండు నుంచి గోదాం రోడ్డు వెళ్లే దారిలో చెత్త సకాలంలో తొలగడం లేదు. - శ్రీధర్, గోదాంరోడ్డు

సిబ్బందితో చెత్త తొలగింపజేశాం. - పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

జిల్లాకేంద్రంలోని అయ్యప్ప ఆలయం వెనకాల చెత్త పేరుకుపోయింది. - శ్రీనివాస్, అయ్యప్పనగర్

చెత్తను సేకరించి ఆ స్థలాన్ని శుభ్రం చేశాం. - పర్వేజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

ఎస్సీ బీసీ కాలనీలో బోరు మోటార్లు దెబ్బతిన్నాయి. - రాజు, సీతారాంపల్లి

పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - సౌందర్య, కార్యదర్శి, సీతారాంపల్లి

బీబీపేటలోని బాలికల పాఠశాలకు సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రం వెనకాల మురుగు కాల్వ దోమలకు, పందులకు ఆవాసంగా మారింది. - స్వామి, బీబీపేట

కల్వర్టు లేక సమస్య తలెత్తుతోంది. మురుగుకాల్వలో నీరు నిల్వ లేకుండా చూస్తాం. - పంచాయతీ కార్యదర్శి రమేశ్, బీబీపేట

సింగరాయపల్లి గ్రామంలో మురుగు కాలువ నిండి సీసీ రోడ్డుపై పారి దుర్వాసన వస్తోంది. దోమల బెడద ఎక్కువగా ఉంది. చంద్రాగౌడ్, గ్రామస్థుడు.

గ్రామంలో మురుగు కాలువలను శుభ్రం చేయించి సమస్యను పరిష్కరిస్తాం. బాల్‌రాజు, పంచాయతీ కార్యదర్శి.

పిట్లం మండల కేంద్రంలోని ఆయా చికెన్ దుకాణాల్లో వ్యర్థాలు తరలించేందుకు వాహనం వస్తోంది. జనావాసాల మధ్య నుంచి వస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నాం. ముఖీద్, స్థానికుడు

జనావాసాల్లోంచి వాహనం రాకుండా చర్యలు చేపడతాం. యాదగిరి, పంచాయతీ కార్యదర్శి, పిట్లం.

- న్యూస్‌టుడే, దోమకొండ, బీబీపేట, పిట్లం, రామారెడ్డి, కామారెడ్డి పట్టణం,



పట్టణంలోని 14వ వార్డులో పలు చోట్ల మురుగు కాల్వలు చెత్తతో నిండిపోవడంపై స్థానికుడురాజేష్ సమస్యను మేమున్నాం మీకు తోడుగా దృష్టికి తేగా పారిశుద్ధ్య పర్యవేక్షకుడు సతీష్ స్పందించి పరిష్కరింపజేశారు.

-న్యూస్‌టుడే,బాన్సువాడ పట్టణం



విద్యార్థి నాయకులు

● భవిష్యత్తుకు బాటలు వేస్తున్న బాలికల గురుకులం

న్యూస్‌టుడే,మద్నూర్

విద్యతో పాటు విభిన్న రంగాల్లో రాణించేలా నైపుణ్యాలు పెంపొందిస్తూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేస్తున్నారు మద్నూర్ మండలం పెద్దఎక్లార గేట్ వద్ద గల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు. వినూత్న విధానాలను పాటిస్తూ భావి భారత పౌరుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు.

☛ ఈ పాఠశాలలో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు 538 మంది బాలికలు చదువుకుంటున్నారు. ఎక్కువ మంది నిరుపేదలే. వీరిలో నాయకత్వ లక్షణాలు కలిగిన వారిని ఎంపిక చేసి ఓ కమిటీని ఏర్పాటు చేశారు. ఇతర పిల్లలు.. చదువు, వైద్యం, సమయపాలన, వ్యక్తిగత శుభ్రత, ఆటపాటల్లో రాణించేలా తర్ఫీదునిస్తున్నారు. ఉపాధ్యాయులు గైర్హాజరు అయినప్పుడు ఆ సమయాన్ని చక్కగా సద్వినియోగం చేసుకుని పలు అంశాల్లో శిక్షణ పొందుతున్నారు. ప్రత్యేక కార్యాచరణ తమలో ఎంతో మార్పు తీసుకువచ్చిందని విద్యార్థినులు పేర్కొన్నారు.



విద్యార్థులకు సలహాలు అందిస్తున్న బృంద నాయకురాలు(పాతచిత్రం)

చదువును నిర్లక్ష్యం చేయకుండా:



సంధ్యారాణి, నాయకురాలు

తోటి విద్యార్థినులు చదువును నిర్లక్ష్యం చేయకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో వారితో హోంవర్క్ చేయిస్తాను. వెనుకబడిన పాఠ్యాంశాల్లో మెరుగైన మార్కులు సాధించేలా కృషి చేస్తున్నాను. ఎవరైనా అనారోగ్యం బారిన పడితే వైద్య సిబ్బంది దగ్గరకు తీసుకువెళతాను.

ఆటలు, సాంస్కృతిక పోటీల్లో...



వైశాలి, నాయకురాలు

ఆటలు, సాంస్కృతిక అంశాలపై ఆసక్తి ఉన్న వారిని గుర్తించి వ్యాయామ ఉపాధ్యాయుల చేత ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నాం. వారానికో సారి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ప్రత్యేక నృత్యాలు నేర్పిస్తున్నాం.

సమష్టి కృషితో...



స్వప్న, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్

సమష్టి కృషితో పాఠశాలను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాను. విద్యార్థినుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు పాఠశాలలో విద్యార్థి సంఘాలను ఏర్పాటు చేసి వారికే బాధ్యతలను అప్పగించాం. టీం లీడర్లు బాలికలందరినీ సమన్వయ పరుస్తూ ముందుకు సాగుతున్నారు. తద్వారా మెరుగైన ఫలితాల సాధనకు మార్గం సుగమమైంది.

ప్రహరీ నిర్మాణం ఎప్పుడో..



మండలంలోని కాటేపల్లి జడ్పీ పాఠశాల ప్రహరీ వంద మీటర్ల మేర కూలి ఏళ్లు గడుస్తున్నా నిర్మాణానికి నోచుకోవడంలేదు. ఒకే ప్రాంగణంలో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, గ్రామ పంచాయతీ కార్యకలాపాలు సాగుతున్నాయి. ప్రహరీ నిర్మాణ విషయమై ప్రతిపాదనలు పంపినా ఫలితం లేదు. పాఠశాల ప్రాంగణంలో ఉన్న ఖాళీ స్థలంలో పశువులు, శునకాలు సంచరిస్తుండంతో విద్యార్థులు ఆడుకోవడానికి, మధ్యాహ్న భోజన సమయంలో ఇబ్బందిగా మారింది. ఈ విషయమై 'న్యూస్‌టుడే' ఇన్‌ఛార్జి ఏఈ మొగులయ్యను బుధవారం వివరణ కోరగా ... ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని ..ఆదేశాలు రాగానే పనులు చేపడతామని పేర్కొన్నారు.

- న్యూస్‌టుడే,పెద్దకొడప్‌గల్



ఎంపీఈవోను విచారిస్తున్న డీపీవో శ్రీనివాస్

వేధింపులపై ఘటనపై విచారణ

బిచ్కుంద, న్యూస్‌టుడే: బిచ్కుంద మండలంలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులపై ఎంపీఈవో అబ్బాగౌడ్ వేధింపులకు గురిచేస్తున్నాడన్న ఫిర్యాదుపై బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో డీపీవో శ్రీనివాస్ విచారణ చేపట్టారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులను విచారించి నివేదికను పాలనాధికారికి అందిస్తామని తెలిపారు. వెంట డీఎల్‌పీవో నాగరాజు, ఉన్నారు.

పోరాటాలకు సిద్ధంగా ఉండాలి

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: బీసీలకు రాజ్యాధికారం కోసం పోరాటాలకు సమాయత్తమవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు అన్నారు. బీసీ గణనకు సర్కారు సమ్మతించడంపై హర్షం వ్యక్తం చేశారు. జిల్లాకేంద్రంలో పుర కార్యాలయం ఎదుట అంబేడ్కర్, జ్యోతిబాపులే విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ప్రతినిధులు మోహనాచారి, రాజయ్య, గోపాల్, సాయాగౌడ్, సిద్ధిరాములు, ఆకుల బాబు, గంగారం, భూపాల్, పరుశురాం, వేణు, ప్రవీణ్, రవి, బ్రహ్మం, సలీం తదితరులున్నారు.



మహనీయుల విగ్రహాలకు పూలమాల వేస్తున్న సాప శివరాములు

పర్యాటక కేంద్రంగా పోచారం జలాశయం

నాగిరెడ్డిపేట,న్యూస్‌టుడే: పర్యాటక కేంద్రంగా పోచారం జలాశయాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఆర్డీవో ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన ప్రాజెక్టు సమీపంలోని ముద్దపురం-ధర్మారెడ్డి రహదారిని పరిశీలించారు. ఆగిన పనులు త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. వెంట తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ మహ్మద్, నాయకులు వెంకట్‌రెడ్డి, కుడుముల సత్యం, దివిటి రాజదాస్, గంగారెడ్డి,సంజీవులు తదితరులు ఉన్నారు.



దస్త్రాలు పరిశీలిస్తున్న ఆర్డీవో ప్రభాకర్

ఉపకార వేతనాలు విడుదల చేయాలి



సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేటు కళాశాలల ప్రతినిధులు....

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థుల ఉపకార వేతనాలు వెంటనే విడుదల చేయాలని ప్రైవేటు కళాశాలల ప్రతినిధులు బుధవారం సబ్‌కలెక్టర్ కిరణ్మయికి వినతిపత్రం అందజేశారు. మూడేళ్లుగా బకాయిలు విడుదలకాకపోవడంతో అధ్యాపకుల వేతనాలు, కళాశాలల నిర్వహణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 14 నుంచి నిరవధిక బంద్ పాటిస్తున్నట్లు తెలిపారు.

కలెక్టరేట్‌లో నేడు ఉచిత ఆరోగ్య శిబిరం

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం(నేడు) ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నట్లు కలెక్టరేట్ వర్గాలు పేర్కొన్నాయి. జిల్లా పాలనాధికారి ఆదేశాల మేరకు నిర్వహించే ఈ శిబిరంలో సీబీపీ, ఎల్ఎఫ్‌టీ, థైరాయిడ్ ప్రొఫైల్ తదితర పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తారని తెలిపారు. కలెక్టరేట్ ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉదయం 9 గంటలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు.

శిక్షణ ధ్రువీకరణ పత్రం అందజేత

కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో ఈవెంట్ మేనేజ్‌మెంట్ కార్యక్రమాలు ప్రారంభించాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పేర్కొన్నారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా పది రోజుల పాటు హైదరాబాద్‌లో ఈవెంట్ మేనేజ్‌మెంట్ శిక్షణ పొందిన చిన్న మల్లారెడ్డి గ్రామానికి చెందిన స్వయంసహాయక సభ్యురాలు జమునకు బుధవారం శిక్షణ ధ్రువీకరణ పత్రం అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సురేందర్, డీపీఎం రమేశ్ బాబు, ఏపీఎం మొయిజ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మాచారెడ్డి, న్యూస్‌టుడే: మాచారెడ్డి మండలం ఘన్‌పూర్ ఎం గ్రామానికి చెందిన భారాస సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఎడపల్లి శ్రీనివాస్ తల్లి ఇటీవల మరణించారు. బుధవారం బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ పరామర్శించారు. భారాస మండలాధ్యక్షుడు బాలచంద్రం, రాజాగౌడ్, భాస్కర్, శ్రీనివాస్, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

టీకాలతో రోగనిరోధక శక్తి పెంపు

పిట్లం, న్యూస్‌టుడే: పశువుల్లో రోగనిరోధక శక్తి పెంచేందుకు టీకాలు వేస్తున్నామని మండల పశువైద్యాధికారి సంతోష్ అన్నారు. బుధవారం కారేగావ్‌లో పశువులకు టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. గోపాలమిత్రలు, రైతులు పాల్గొన్నారు.

దోమకొండ, న్యూస్‌టుడే: అంచనూరులో బుధవారం పశువైద్య శాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. 300 పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు, గర్భకోశ వ్యాధుల నివారణ చికిత్సలు చేశారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి శివకుమార్, ఎల్ఎస్ఏ కిషోర్, వెటర్నరీ అసిస్టెంట్ భూమయ్య, లింగం, బాబు, లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.



కారేగావ్‌లో దూడకు టీకా వేస్తున్న మండల పశువైద్యాధికారి సంతోష్

ఏడీఈగా మల్లేష్ బాధ్యతల స్వీకరణ

లింగంపేట, న్యూస్‌టుడే: లింగంపేట సబ్ డివిజన్ ఏడీఈగా మల్లేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌ఛార్జి ఏడీఈగా పనిచేసిన తిరుపతిరెడ్డి బదిలీపై వెళ్లగా కామారెడ్డిలో పనిచేసిన మల్లేష్ బదిలీపై లింగంపేట వచ్చారు. ఆయనకు సిబ్బంది స్వాగతం పలికి సన్మానించారు. ఏఈలు సాయినాథ్, హరీష్‌రావు సిబ్బంది వాహేద్, ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్వాగతం పలుకుతున్న అధికారులు

హాజరు శాతం పెంపే లక్ష్యం

గాంధారి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల హాజరు శాతం గత రెండు నెలల నుంచి తగ్గడంతో బుధవారం స్వయంగా ప్రిన్సిపల్ గడ్డం గంగారాంతో పాటు అధ్యాపక బృందం ఆధ్వర్యంలో విద్యార్థుల ఇంటిబాట పట్టారు. ఈ నెల 18 నుంచి అర్ధ సంవత్సర పరీక్షలు సమీస్తున్న వేళ తప్పనిసరిగా కళాశాలకు పంపించాలని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అధ్యాపక బృందం లక్ష్మణ్, రాజగోపాల్, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.



తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపల్ గంగారాం

టీఎన్జీవోస్ డివిజన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్

బాన్సువాడ, న్యూస్‌టుడే: టీఎన్జీవోస్ బాన్సువాడ డివిజన్ అధ్యక్షుడిగా తుల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బాన్సువాడ పట్టణంలో బుధవారం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా సీహెచ్ రవి, సుభాష్, కే.సుభాష్, శ్వేత, కార్యదర్శిగా అజీముద్దీన్, సంయుక్త కార్యదర్శులుగా గంగా నర్సయ్య, వెంకటేష్, గంగాసుధా, కోశాధికారిగా సయాద్ అబ్దుల్ రజాక్, కార్యనిర్వాహక కార్యదర్శిగా సాయిలు, ప్రచార కార్యదర్శిగా శ్యామ్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా వై.శ్రీనివాస్, పవిత్రన్, అబ్దుల్ అలీం, బాల్‌రాజ్ తదితరులు ఎన్నికయ్యారు. సభ్యులను జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అభినందించారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో జట్లకు ఎంపిక

లింగంపేట,న్యూస్‌టుడే: శట్పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న మేనక, స్వప్నలు రాష్ట్ర స్థాయి ఖోఖో జట్టుకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు వసుధ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఇంజినీర్ చంద్రకాంత్‌రెడ్డి, సర్పంచి పద్మలు కలిసి విద్యార్థినులను సన్మానించారు. చంద్రకాంత్‌రెడ్డి పాఠశాలకు రూ.4 వేల విరాళం అందజేశారు.



విద్యార్థినికి జ్ఞాపిక అందజేస్తున్న ఉపాధ్యాయులు

అలరించిన కవ్వాలి

లింగంపేట, న్యూస్‌టుడే: కుల మతాలకు అతీతంగా గార్విన్ విందు ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రభుత్వ సలహాదారు, మాజీ మంత్రి షబ్బీర్ ఆలీ అన్నారు. మంగళవారం రాత్రి లింగంపేట మండల కేంద్రంలో రాష్ట్ర సీనియర్ న్యాయవాది, జలమండలి సభ్యులు మహమ్మద్ మోయినమ్మద్ ఖాద్రి తన ఫాంహౌస్‌లో కవ్వాలీ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి షబ్బీర్ ఆలీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖాద్రి మాట్లాడుతూ తన సంపదలో సగభాగం పేదలకు దానం చేస్తున్నట్లు చెప్పారు. డీసీసీ అధ్యక్షుడు కైలాస శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



విందులో పాల్గొన్న షబ్బీర్ ఆలీతో ఖాద్రీ

న్యాయం చేయాలంటూ ఎస్పీకి వినతి

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: గాంధారి మండలం దుర్గానగర్ కాలనీలో ఉండే ఎరుకల పెద్ద సాయిలు కుటుంబంపై దాడి చేసి నివాసాలను ధ్వంసం చేయడమే కాకుండా స్థానిక పోలీసుస్టేషన్‌లో తప్పుడు ఫిర్యాదు చేసిన అయిదుగురిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలంటూ జిల్లా ఎస్పీ సింధు శర్మకు బాధితులు బుధవారం వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో తెలంగాణ ఎరుకల గిరిజన హక్కుల ఐక్య పోరాట సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోనేరు సాయికుమార్, జిల్లా అధ్యక్షుడు కుర్ర రాములు, పెంటయ్య, ఎల్లయ్య తదితరులున్నారు.

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

బీర్కూర్, నస్రుల్లాబాద్, బాన్సువాడ గ్రామీణం: రుణమాఫీపై ప్రతిపక్ష పార్టీలు రైతులను తప్పుదోవ పట్టిస్తున్నాయని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్ పేర్కొన్నారు. బైరాపూర్‌లో బుధవారం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఇన్‌ఛార్జి సొసైటీ ఛైర్మన్ శ్యామ్, సీఈవో భూమయ్య తదితరులు పాల్గొన్నారు. బీర్కూర్ సొసైటీ పరిధిలోని కిష్టాపూర్, చించోల్లిలోని కొనుగోలు కేంద్రాలను డీసీవో రామ్మోహన్ రావు ప్రారంభించారు. సొసైటీ ఛైర్మన్ గాంధీ, విండో కార్యదర్శి విఠల్, వైస్ ఛైర్మన్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. దామరంచలో డీసీసీబీ డైరెక్టర్ కమలాకర్ రెడ్డి, మైలారంలో సొసైటీ ఇన్‌ఛార్జి ఛైర్మన్ దేవళ్ల హన్మంత్‌రావు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. బాన్సువాడ గ్రామీణ మండలం దేశాయిపేట్ సహకార సంఘం పరిధిలోని ఇబ్రహీంపేట్, పోచారం, రాంపూర్ తండాల్లో వరి కొనుగోలు కేంద్రాలను వైస్ ఛైర్మన్ అంబర్ సింగ్ ప్రారంభించారు.



బీర్కూర్: బైరాపూర్‌లో తూకం వేస్తున్న కాసుల బాల్‌రాజ్

దళారులకు విక్రయించొద్దు

గాంధారి, న్యూస్‌టుడే: దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దని తహసీల్దార్ సతీష్‌రెడ్డి, సొసైటీ ఛైర్మన్ సాయికుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు గుర్జాల్, బ్రాహ్మణపల్లి, మాతుసంగెం, పెట్‌సంగెం, పొతంగల్‌కుర్దు, చద్మల్‌ల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఏఎంసీ ఛైర్మన్ పరమేష్, నాయబ్ తసీల్దార్ రవీందర్, మాజీ సర్పంచి సంజీవ్, సొసైటీ వైస్‌ఛైర్మన్ ఉదల్‌సింగ్, డైరెక్టర్లు సంతోష్, సాయిలు, శివాజీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రంలోని పురాతన వేణుగోపాలస్వామి ఆలయ పునరుద్ధరణకుగాను భక్తుడు కొమ్మ శ్రీనివాస్ బుధవారం రూ.11,116 విరాళం అందజేశారు. ధర్మకర్త కంజర్ల మధు మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధిలో భక్తులు భాగస్వాములు కావాలన్నారు.

బెంచీల వితరణ

నాగిరెడ్డిపేట్: నాగిరెడ్డిపేట్ మండలంలోని బంజారా తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్రముఖ శాస్త్రవేత్త, రాష్ట్ర భాజపా నాయకులు పైడి ఎల్లారెడ్డి బుధవారం బెంచీలు వితరణ చేశారు. ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ మూర్తి, రాజదాస్, హన్మండ్లు, దేవిసింగ్,కిషన్, భాస్కర్ పాల్గొన్నారు.

చరవాణి అందజేత

మాచారెడ్డి: పల్వంచ మండలం పోతారం గ్రామానికి చెందిన నర్సాపురం పోశయ్య ఇటీవల చరవాణి పోగొట్టుకున్నాడు. పోలీసులను ఆశ్రయించగా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి బాధితుడికి అందజేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు.

బంద్ విజయవంతానికి పిలుపు

బీర్కూర్, న్యూస్‌టుడే: హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులకు నిరసనగా గురువారం బీర్కూర్‌లో నిర్వహించే బంద్‌ను విజయవంతం చేయాలని హిందూ సంఘాల నాయకులు పేర్కొన్నారు. బీర్కూర్ రామాలయంలో బుధవారం విలేకర్లతో మాట్లాడారు. బస్వరాజ్, బీరుగొండ, గాలయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

ఎగువమానేరు జలాశయంలో దూకి కూలీ ఆత్మహత్య



ప్రకాశ్

గంభీరావుపేట, న్యూస్‌టుడే: అప్పుల బాధ భరించలేక జలాశయంలో దూకి కూలీ ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని నర్మాల ఎగువమానేరు జలాశయం వద్ద బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... పల్వంచ మండలం ఇసాయిపేటకు చెందిన గుడ్లపల్లి ప్రకాశ్ (55)కు భార్య నాగలక్ష్మి, ఒక కొడుకు, కూతురు ఉన్నారు. రెండేళ్ల కిందట పల్వంచ మండలంలోని వేల్పుగొండకు వచ్చి జీవిస్తున్నారు. ప్రకాశ్ కూలీ పని చేస్తూ జీవనం కొనసాగించగా ఇటీవల కూతురు వివాహం చేశాడు. అనారోగ్య సమస్యలు ఉన్నాయి. ఈక్రమంలో బంధువుల వద్ద, తెలిసిన వారి వద్ద అధిక మొత్తంలో అప్పులు చేశాడు. వాటిని ఎలా తీర్చాలోనని బాధపడుతుండేవాడు. ఈ నెల 15న పనికి వెళ్లి రాత్రి అయినా ఇంటికి రాకపోయే సరికి చుట్టు పక్కల వెతికారు. బుధవారం ఎగువమానేరు వద్ద దుస్తులు, చెప్పులు ఉండటంతో జలాశయంలో చూశారు. అందులో మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. జాలర్ల సహకారంతో మృతదేహాన్ని బయటకు తీసి శవపరీక్ష కోసం పంపించారు. అప్పుల బాధతో తన భర్త మానేరు జలాశయంలో పడి ఆత్మహత్య చేసుకున్నాడని నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు.

దాడి చేసిన వారిపై కేసు

కామారెడ్డి నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రంలోని ప్రియా కాంప్లెక్స్ ప్రాంతంలో గాంధారి మండలం జువ్వాడికి చెందిన బక్కతట్ల బాలేందర్ 'శివం ఎలక్ట్రికల్స్' దుకాణాన్ని నడుపుతున్నాడు. ఎప్పటిలాగే బుధవారం ఉదయం దుకాణం తెరిచి తన పని చేసుకుంటున్నాడు. ఇంతలో ఓ కారులో వచ్చిన అయిదుగురు గొడవపడ్డారు. తమను చూసి నవ్వుతున్నావంటూ సదరు వ్యక్తులు దుకాణంలోకి చొరబడి బాలేందర్‌పై దాడి చేసి కొట్టారు. అసభ్య పదజాలంతో దూషిస్తూ బయటకు లాక్కొచ్చారు. దుకాణ భాగస్వామి అయిన శివరాజుపై దాడిచేసి కొట్టారు. బాధితులు పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధ్యులను పట్టుకుంటామని పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

దాబా యజమానులపై ...

పిట్లం: మండల కేంద్రంలో ప్రభుత్వ అనుమతి లేకుండా మద్యం సిట్టింగ్ నిర్వహిస్తున్న రెండు దాబాల యజమానులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు బుధవారం తెలిపారు. దాబాల్లో మద్యం నిషేధమని, నిబంధన అతిక్రమిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృత్యువాత

భిక్కనూరు, న్యూస్‌టుడే: భిక్కనూరులో మహ్మద్ ఖాదిర్ తన వ్యవసాయ క్షేత్రం వద్ద గేదెను తాడుతో కట్టేశాడు. గేదె గడ్డి మేస్తుండగా విద్యుత్తు తీగ మంగళవారం తెగిపడింది. దీంతో గేదె అక్కడికక్కడే మృత్యువాతపడింది. గేదెకు మండల పశువైద్యాధికారి డా.దేవేందర్ బుధవారం పంచనామా నిర్వహించాడు.

నిషేధిత అల్ప్రాజోలం పట్టివేత

లింగంపేట,న్యూస్‌టుడే: లింగంపేట మండలం సూరాయిపల్లి గ్రామంలో నిషేధిత అల్ప్రాజోలం పట్టుకున్నట్లు ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు ...రమేష్‌గౌడ్ కల్లు దుకాణంపై దాడి చేసి తనిఖీ చేయగా 30 గ్రాముల అల్ప్రాజోలం లభించిందని చెప్పారు. విచారణలో భాగంగా దానిని నాగిరెడ్డిపేట్ మండలం రామక్కపల్లికి చెందిన తన బామ్మర్ది అయిన సత్యనారాయణ గౌడ్ ఇచ్చినట్లు చెప్పారు. అనంతరం సత్యనారాయణను తనిఖీ చేయగా అతని వద్ద 20 గ్రాముల మత్తు పదార్థం లభించింది. రెండు సంవత్సరాలుగా దానిని కొనుగోలు చేసి కల్లులో కలిపి ప్రజలకు విక్రయిస్తున్నట్లు రమేష్ చెప్పారు. 50 గ్రాముల అల్ప్రాజోలం , రెండు కల్లు సీసాలు, చరవాణులను స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. దర్యాప్తులో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై అరుణ్, హెడ్ కానిస్టేబుల్ రాజేందర్, కానిస్టేబుళ్లు భైరవ ప్రసాద్, రమేష్, రామస్వామిలను డీఎస్పీ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

20న మెగా రక్తదాన శిబిరం

కామారెడ్డి పట్టణం: జిల్లాకేంద్రంలో ఈ నెల 20వ తేదీ(ఆదివారం)న మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు రక్తదాతల సమూహ బాధ్యుడు బాలు అన్నారు. కార్యక్రమానికి హాజరయ్యేందుకు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీకి బుధవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారులకు అండగా నిలిచేందుకు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామన్నారు.

ఉత్తమంగా తీర్చిదిద్దాలి

బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే: నూతన ఉపాధ్యాయులు విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దాలని బాన్సువాడ మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. డీఎస్సీ 2024 ద్వారా నియామకమైన నూతన ఉపాధ్యాయులకు పట్టణంలోని కార్యాలయంలో బుధవారం జాయినింగ్ ఆర్డర్స్‌ను అందజేశారు.

బకాయిల విడుదలకు డిమాండు

కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే: బకాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర కోశాధికారి సురేశ్ ఓ ప్రకటనలో సర్కారును డిమాండ్ చేశారు. కళాశాలల్లో ధ్రువపత్రాలు తీసుకునే వేళ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి తగిన న్యాయం చేయాలన్నారు.